సాక్షి రంగారెడ్డి

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



నృత్య 'కీర్తి'

వృత్తి రీత్యా ఆమె ఉపాధ్యాయురాలు.. కూచిపూడి నృత్యంలో తనకంటూ ఓ ప్రత్యేక తను సంపాదించుకుంది. 8లో▸




ఠాణాల సందర్శన

ట్రైనీ ఐపీఎస్‌ల బృందం మంగళవారం ఆదిబట్ల, యాచారం, ఆమనగల్లు, కొందుర్గు పోలీస్ స్టేషన్లను సందర్శించింది. 8లో▸

అదనపు బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: బాబూ జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా నేడు అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. బషీర్‌బాగ్‌లోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద బుధవారం ఉదయం జరిగే వేడుకలకు వచ్చేవారి కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులు నడపనున్నారు. రవీంద్ర భారతిలో సాయంత్రం జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగానూ అదనపు బస్సులను ఏర్పాటు చేయనున్నారు.



న్యూస్‌రీల్

మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి



మహిళలతో కలిసి జై కొడుతున్న రెజీనా

మొయినాబాద్‌రూరల్: మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సినీనటి రెజీనా కాసండ్ర అన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి పంచాయతీ అనుబంధ గ్రామమైన చాకలిగూడలో మంగళవారం డెమోక్రటిక్ సంఘ సహాయ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రఖ్యాత గైనకాలజిస్టు డాక్టర్ ప్రజ్వలతో కలిసి పునరుత్పత్తి ఆరోగ్యం, రుతుక్రమ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



కొత్తగూడలో చిన్నారులకు మ్యాట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

కందుకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సూచించారు. మండల పరిధిలోని కందుకూరు, కొత్తగూడలతో పాటు మహేశ్వరం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు నేలపై కూర్చోవడం చూసి తన ఆర్ట్ ఫౌండేషన్ ద్వారా మ్యాట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ నుంచి కందుకూరు మండలంలో రూ.1.39 కోట్ల నిధులతో సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలతో పాటు కందుకూరు చౌరస్తా, గూడూరులోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సాధ మల్లారెడ్డి, సీడీపీఓ షబానా, నాయకులు ఎస్.జైపాల్‌రెడ్డి, సామ ప్రకాష్‌రెడ్డి, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, ప్రశాంత్‌చారి, దేశం మోహన్‌రెడ్డి, బక్కం వెంకటేష్, విఘ్నేశ్వర్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, మాధవాచారి, బాలేష్, వెంకటేశ్‌గౌడ్, తేజానాయక్ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు స్లాట్‌బుకింగ్ అవకాశం

ఇబ్రహీంపట్నం రూరల్: దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం మీ సేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పి.ప్రభాకర్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నెల రోజుల పాటు స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. వనస్థలిపురం ఏరియా అస్పత్రి, కొండాపూర్ జిల్లా అస్పత్రిలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నెల 11న ఆర్థోపెడిక్, మెంటల్ రెట్రడేషన్, 18న ఆర్థోపెడిక్, కంటిచూపు, చెవిటి పరీక్షలు, 25న ఆర్థోపెడిక్, మెంటల్ రెట్రడేషన్, మెంటల్ ఇల్నీస్, 28న ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు స్లాట్ బుక్ చేసుకోవాలని, తరువాత నిర్ధారించిన తేదీల్లో సంబంధించిన ధ్రువపత్రాలు అందిస్తారన్నారు.

నేడు కవి సమ్మేళనం

షాద్‌నగర్‌రూరల్: ఉగాది వేడుకల్లో భాగంగా బుధవారం 'రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం–ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం' నిర్వహిస్తున్నట్లు సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు టీవీ రంగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఈడెన్ ప్లాజాలో సాయంత్రం 5గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీవీ, రంగస్థల నటుడు మల్లాది భాస్కర్ బృందంచే తులసీతీర్థం (హాస్యనాటిక)ను ప్రదర్శించడం జరుగుతుందని, చిన్నారుల కూచిపూడి నృత్యాలు, ఏక పాత్రాభినయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

సరికొత్త దందా!



టీఎస్ఐఐసీకి అప్పగించిన భూమికి మళ్లీ దరఖాస్తులు

- డాక్యుమెంట్లు లేవు.. సాగు చేసిన ఆనవాళ్లు లేవు..
- కబ్జాలో ఉన్నట్లు పేర్కొంటూ నష్టపరిహారానికి అప్లికేషన్
- ప్రజాప్రతినిధులతో పైరవీలు
- తలపట్టుకుంటున్న రెవెన్యూ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఫార్మాసిటీ భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపులో ఇప్పటికే అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా..తాజాగా మరో దోపిడీ పర్వానికి తెరతీశారు. ఇప్పటికే రైతుల నుంచి భూములు సేకరించి, వారికి నష్టపరిహారం కూడా చెల్లించి టీఎస్ఐఐసీకి అప్పగించిన భూముల కు ఎన్‌క్రోచర్స్ పేరుతో మళ్లీ కొత్త దరఖాస్తులు పుట్టుకొస్తున్నాయి. ఎలాంటి రికార్డులు లేని, భూమితో సంబంధం లేని స్థానికేతరుల పేర్లతో దరఖాస్తు చేయించి నష్టపరిహారం చెల్లించాల్సిందిగా కోరుతూ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇప్పటికే ఒకసారి నష్టపరిహారం చెల్లించిన భూములకు మరోసారి నష్టపరిహారం ఎలా చెల్లించాలో అర్థం కాక రెవెన్యూ అధికారులు బుర్ర బద్దలు కొట్టుకుంటున్నారు. ఫార్మాసిటీ కోసం ప్రభుత్వం కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో 19,333 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించి, ఈ మేరకు ఇప్పటికే తొలివిడతగా పదివేల ఎకరాలు సేకరించి, తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీఎస్ఐఐసీ)కి అప్పగించింది. పట్టా భూమికి ఎకరానికి రూ.16 లక్షలు, అసైన్డ్ భూములకు రూ.8 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించింది. ఈ నష్టపరిహారంపై కొంత మంది దళారులు కన్నేశారు. అడ్డగోలుగా నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి, పొజిషన్‌లో ఉన్న భూ విస్తీర్ణానికి 0మించి లబ్ధి పొందారు. అధికారులకు కూడా చూసీచూడనట్లు వదిలేశారు. అధికారుల ఉదాసీనతను స్థానికంగా ఉన్న కొంత మంది దళారులు ఆసరాగా చేసుకుని తిరిగి కొత్తదందాకు తెరతీశారు.

సాయిరెడ్డిగూడలో..

ముచ్చర్ల సాయిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 288లో సుమారు రెండు వేల ఎకరాల భూమి ఉంది. దీనిలో 383 ఎకరాల పట్టా భూములు కాగా, మిగిలినదంతా ప్రభుత్వ, అసైన్డ్ భూములే. అసైన్డ్‌దారుల్లో కొంత మంది అప్పటికే ఆ భూములను ఇతరులకు అమ్ముకున్నారు. ప్రభుత్వం 2016–17లోనే ఫార్మాసిటీకి ఈ భూములను సేకరించింది. ఒకరిద్దరు మినహా బాధిత రైతులందరికీ నష్టపరిహారం చెల్లించింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే ఆయా భూములను టీఎస్ఐఐసీకి అప్పగించింది. ఒకసారి భూమిని సేకరించి, బాధితులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాత మళ్లీ..అదే భూమిపై మరికొంత మంది నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిజానికి వీరి వద్ద ఎలాంటి డాక్యుమెంట్లు లేవు. సాగు చేసిన ఆనవాళ్లు కూడా లేవు. కానీ అధికారపార్టీకి చెందిన కొంత మంది నేతలు కొత్తగా మరికొంత మందికి నష్టపరిహారం ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారు. తాము సూచించిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ప్రభుత్వంలోని పెద్దల నుంచి ఒత్తిడి తీసుకొస్తుండటంతో ఏం చేయాలో అర్థం కాక స్థానిక రెవెన్యూ అధికారులు తలపట్టుకుంటున్నారు.

తాడిపర్తి, కుర్మిద్దలోనూ ఇదే తంతు

యాచారం మండలం కుర్మిద్దలోని సర్వే నంబర్ 39లో 112 ఎకరాల సీలింగ్ భూములు ఉన్నాయి. అప్పట్లో ఈ భూమిని 86 మందికి అసైన్డ్ చేసింది. వీటిని కూడా ఫార్మా సిటీ కోసం సేకరించి, ఇప్పటికే నష్టపరిహారం చెల్లించింది. క్షేత్రస్థాయిలో ఉన్న భూ విస్తీర్ణానికి మించి అసైన్డ్ పట్టాలు ఉండటం, చెల్లింపులు నిరాకరిస్తే..భూ సేకరణలో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు కూడా కిమ్మనకుండా నష్టపరిహారం చెల్లించారు. అసలు బాధితులకు బదులు..స్థానికతతో సంబంధం లేని వ్యక్తులకు నష్టపరిహారం చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా ఇదే సర్వే నంబర్ భూమిలో ఎన్‌క్రోచర్స్ పేరుతో కొంత మంది నష్టపరిహారం కోసం దరఖాస్తు చేసుకోవడం, ఏకంగా అధికారపార్టీ నేతలే రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకొస్తుండటం గమనార్హం.

నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నాం

ఆక్రమణదారుల పేరుతో అనేక మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇప్పటికే నష్టపరిహారం చెల్లించి, టీఎస్ఐఐసీకి భూములు అప్పగించిన భూమికి మళ్లీ నష్టపరిహారం చెల్లించడం కుదరదని చెబుతున్నాం. అయినా వినిపించుకోకుండా ఎమ్మెల్యేలు, మంత్రులతో ఫోన్లు చేయిస్తున్నారు. వారికి కూడా ఇదే చెబుతున్నాం. ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నాం.

– సూరజ్‌కుమార్, ఆర్డీఓ, కందుకూరు

ఇళ్ల పట్టాలతో పేదల జీవితాల్లో వెలుగులు



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి సబితారెడ్డి

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: సొంతింటి కలను సాకారం చేసి నిరుపేదల జీవితాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ వెలుగులు నింపారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్‌లో 58, 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న 305 మంది లబ్ధిదారులకు మంగళవారం జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ కాలనీలోని మినీ ఫంక్షన్‌హాల్‌లో పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ జీవోతో గతంలో 2014 సంవత్సరం వరకు మాత్రమే అవకాశం ఉండగా, ప్రస్తుతం 2020 సంవత్సరం లోపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ ఏప్రిల్ చివరి నాటికి మరోసారి దరఖాస్తు చేసుకునేందుకు సీఎం కేసీఆర్ అవకాశం కల్పించారని తెలిపారు. పేద ప్రజలంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, తహసీల్దార్ జనార్దన్‌రావు, మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు మాదరి సురేఖరమేష్, గడ్డమీది రేఖ, గజ్జెల రాంచందర్, సిద్దాల లావణ్య, బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సరూర్‌నగర్ మండల కార్యాలయంలో..

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న పేదలకు జీవో 58, 59లతో ఎంతో లబ్ధి చేకూరుతుందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ మండల కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల చివరి వరకు సీఎం కేసీఆర్ సమయం ఇచ్చారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్‌గుప్తా, యెగ్గె మల్లేశం, కందుకూరు ఆర్డీఓ సూరజ్, తహసీల్దార్ జయశ్రీ, పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

58,59 జీవోలను సద్వినియోగం చేసుకోవాలి

తుక్కుగూడ: ప్రభుత్వం ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కోసం తెచ్చిన 58,59 జీవోలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సూచించారు. మున్సిపల్ పరిధిలో 58,59 జీవోల కింద అర్జీ పెట్టుకున్న లబ్ధిదారులకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు ఉండి ఇంకా నమోదు కాని వారు తక్షణమే నమోదు చేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, తహసీల్దార్ మహమూద్ అలీ, వైస్ చైర్మన్ భవాని వెంకట్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వెట్టి నుంచి వలస కార్మికులకు విముక్తి



కార్మికులకు విముక్తి కల్పించిన అధికారులు

షాద్‌నగర్‌రూరల్: వలస కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ఇటుక బట్టీలపై పోలీసులు మెరుపు దాడి చేసి 44 మంది వలస కార్మికులకు విముక్తి కల్పించిన ఘటన షాద్‌నగర్ పరిధిలోని కిషన్‌నగర్ పంచాయతీ దొడ్డిగడ్డ తండా శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఇటుక బట్టీల యజమాని ఒట్యా నాయక్ ఛత్తీస్‌ఘడ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కొంత మందిని ఓ వ్యక్తి ద్వారా నాలుగు నెలల క్రితం పని కోసం ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ పంచాయతీ పరిధిలోని దొడ్డిగడ్డ తండాకు తీసుకువచ్చాడు. వారిలో 12 మంది పిల్లలు, 18 మంది పురుషులు, 14 మంది మహిళలు ఉన్నారు. పని ప్రదేశం నుంచి బయటికి వెళ్లనీయకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాడు. పనికి తగిన వేతనం ఇవ్వకపోగా కార్మికులు ఉండేందుకు కనీస వసతులు కల్పించకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదేమని అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. తమ గోడు చెప్పుకోవడానికి ఎవరూ లేకపోవడంతో కార్మికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న సీఐడీ విభాగంలో పని చేస్తున్న అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అధికారి మహేశ్ భగవత్ ఆదేశాల మేరకు ఎస్పీ నాగలక్ష్మి, డీఎస్పీలు రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ విజయ్, ఏఎస్ఐ తిరుపతితో పాటు డీటీ ఆనంద్‌సింగ్, లేబర్ ఆఫీసర్ రాధ, కానిస్టేబుళ్లు కాశీ, సంపూర్ణ, తూక్యా నాయక్ మంగళవారం సాయంత్రం ఇటుక బట్టీలపై మెరుపు దాడి చేశారు. 44 మంది కార్మికులకు విముక్తి కల్పించి వారిని స్వస్థలాలకు పంపించారు.

ప్రజలను మోసం చేసేందుకే సమ్మేళనాలు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

మీర్‌పేట: ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్ఎస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేసేందుకే ఆత్మీయ సమ్మేళనాల పేరిట కొత్త నాటకానికి శ్రీకారం చుట్టిందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులకు వారి నియోజకవర్గాల్లోని సమస్యలు తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆత్మీయ సమ్మేళనాలు కాదు ఆత్మ పరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. డబుల్ బెడ్‌రూం పథకంలో విఫలమైన ప్రభుత్వం తాజాగా సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి రూ.3 లక్షలు ఇస్తామని చెబుతోందని, లబ్ధిదారులను గుర్తించేది ఎప్పుడు, నగదు అందజేసేది ఎప్పుడని ఆయన ప్రశ్నించారు. బడంగ్‌పేట,మీర్‌పేట కార్పొరేషన్లలో అభివృద్ధి శూన్యమని, నేటికీ చాలా ప్రాంతాల్లో 3ఫేజ్ విద్యుత్ లైన్‌లు లేకపోవడంతో ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారని అన్నారు. కార్పొరేషన్లలోనే ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. కార్పొరేషన్లలో సరైన డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోలేదని, సరైన నీటి సరఫరా లేక ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కోట్లాది రూపాయలు నిధులు తెస్తున్నామన్న బీఆర్ఎస్ నాయకులు అభివృద్ధి ఎక్కడ చేశారో చూపాలన్నారు. తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఒక్క రేషన్‌కార్డు మంజూరు చేయలేదని, కేజీటూ పీజీ,నిరుద్యోగ భృతి లేవని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన పెన్షన్లు తప్ప కొత్తగా మంజూరు చేయలేదన్నారు. సమావేశంలో నాయకులు చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, వెంకటేశ్‌గౌడ్, కీసర యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రమణీయం

- నేత్ర పర్వంగా చిలుకూరు బాలాజీ కల్యాణం



పురవీధుల్లో విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

మొయినాబాద్: పచ్చని తోరణాలు.. పూల పందిరి.. మంగళ వాయిద్యాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కలియుగదైవం వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్ధరాత్రి 12 నుంచి 2గంటల వరకు వేంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణం కనుల పండువగా సాగింది. ముందుగా శ్రీవారిని ఊరేగింపుగా ఆలయ సమీపంలోని మండపంలోకి తీసుకెళ్లారు. అనంతరం అమ్మవార్లను ఊరేగింపుగా స్వామివారి చెంతకు తీసుకెళ్లి ఎదుర్కోళ్ల కార్యక్రమం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల తరపువారు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. ఆలయ అర్చకులు నృత్యాలు చేస్తూ ఎదురుకోళ్ల కార్యక్రమాన్ని రక్తికట్టించారు. అనంతరం స్వామి, అమ్మ వార్లను ఊరేగింపుగా ఆలయ గర్భగుడి వెనుక భాగంలో ఏర్పాటు చేసిన పెళ్లి పందిరిలో ఆసీనులను చేశారు. వేదమంత్రోచ్ఛరణలతో శ్రీనివాసుని కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ముందుగా విష్వక్సేనుని ఆరాధించి శుద్ధివచనం, పుణ్యాహవచనాలు చేశారు. భారతీయ సాంప్రదాయంలో కల్యాణానికి, తాళిబొట్టుకు, పెళ్లి పందిరికి ఉన్న విశిష్టతలను అర్చకులు భక్తులకు వివరిస్తూ వైకుంఠ వాసుని కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. వేడుకలో ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ సౌందరరాజన్, కన్వీనర్ గోపాలకృష్ణ స్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, కన్నయ్య, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, మురళి, కిట్టు, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గజ వాహనంపై ఊరేగించారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన గున్నాల వంశీయులు



స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

స్వామి, అమ్మవార్లకు చిలుకూరు పంచాయతీ పాలకవర్గంతోపాటు గున్నాల వంశీయులు పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు జయవంత్, మల్లారెడ్డి, నర్సింహాగౌడ్, చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, నాగేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సబితకు వినతిపత్రం అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి, రైతులు

పరిహారం పెంచండి

- మంత్రి సబితను కోరిన రైతులు
- సీఎం కేసీఆర్‌తో చర్చించి న్యాయం చేస్తానని హామీ

చేవెళ్ల: హైదరాబాద్ – బీజాపూర్ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని మంత్రి సబితను రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు సీ సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల నాయకులు, రైతులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి సబితారెడ్డిని కలసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించేలా చొరవ చూపాలని కోరారు. రోడ్డు విస్తరణకు 2018లో నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ 2021 వరకు టెండర్లు పిలువలేదన్నారు. ఇప్పుడు పనులు ప్రారంభించి 2018 ప్రకారం పరిహారం చెల్లిస్తామని చెప్పడం సరికాదన్నారు. దీని వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పుడున్న మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తే రైతులకు కొంతలో కొంతైనా ఊరట లభిస్తుందన్నారు. బహిరంగ మార్కెట్ భూముల విలువ కోట్లలో ఉందని, 2018 ప్రకారం పరిహారం చెల్లిస్తే రైతులకు ఎక్కువ నష్టం జరుగుతుందని తెలిపారు. పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డుకు ఇరువైపులా పట్టా భూములే ఉన్నాయని, అలాంటి వారికి తీరని నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వంతో చర్చించి రైతులకు పరిహారం పెంచి ఇచ్చేలా చూడాలని కోరారు. అలాగే చేవెళ్ల, మొయినాబాద్‌లలో వస్తున్న బైపాస్ రోడ్డుకు సర్వీస్ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. దీని వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. స్పందించిన మంత్ర సబితారెడ్డి పరిహార విషయాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అలాగే కలెక్టర్‌తో కూడా చర్చించనున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో డీసీసీ ఉపాధ్యక్షుడు బీ ఆగిరెడ్డి, రైతులు పీ దామోదర్‌రెడ్డి, జే శ్రీకాంత్‌రెడ్డి, బీ వెంకట్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, బల్వంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రభు, నర్సింహారెడ్డి, భోజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, సతీష్ తదితరులు ఉన్నారు.

యువకులపై కేసు

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామ సమీపంలో ఆర్ జంగయ్య, బాలాజీపై దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు మాడ్గుల సీఐ కృష్ణమోహన్ మంగళవారం తెలిపారు. ఇర్విన్ గ్రామానికి చెందిన జంగయ్య, బాలాజీ తమ ద్విచక్ర వాహనంపై బ్రాహ్మణపల్లి నుంచి ఇర్విన్ వెళుతుండగా గ్రామ సమీపంలో రోడ్డుపై కొందరు యువకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో జంగయ్య అభ్యంతరం తెలిపాడు. దీంతో పీ రాజీవ్, అతని స్నేహితులు జంగయ్యపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కిరణ్‌కుమార్ మృతదేహం లభ్యం



ఇబ్రహీంపట్నం రూరల్: స్నేహితులతో కలసి ఈతకు వెళ్లి నీటిలో మునిగిన యువకుడి మృతదేహం మూడు రోజుల తరువాత మంగళవారం బయటపడింది. ఆదిబట్ల ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. నగరంలోని ఉప్పుగూడకు చెందిన స్నేహితులు సాయి కుమార్, హన్మంత్‌నాయక్, ఉదయ్‌కిరణ్, రాహుల్, అఖిల్, కిరణ్‌కుమార్ ఆదివారం ఆదిబట్లలోని కొంగరకలాన్‌లో గల బోరబండ క్వారీ కుంటలో ఈతకు వెళ్లారు. కిరణ్‌కుమార్ మినహా మిగతా ఐదు మంది నీటిలోకి దిగారు. కొద్దిసేపటి తరువాత కిరణ్‌కుమార్ కూడా నీటిలోకి దిగాడు. ఈత రాకపోవడంతో నీట మునిగాడు. చుట్టు పక్కల వారు అతన్ని కాపాడేందుకు యత్నించారు. అప్పటికే కిరణ్ నీటిలో మునిగిపోయాడు. మూడు రోజులుగా మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం డీఆర్ఎఫ్ బృందాలు మృతదేహాన్ని వెలికితీశాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కల్వకుర్తికి 4వేల 'గృహలక్ష్మి' ఇళ్లు

- ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 3లక్షలు
- ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గంలో గృహలక్ష్మి పథకం కింద 4 వేల ఇళ్లు మంజూరయ్యాయని, ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3లక్షలు అందజేస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో తహసీల్దార్ మురళీకృష్ణతో కలసి 87 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లి భారం కారాదనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఎస్టీ సబ్ ప్లాన్‌లో భాగంగా కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల్, ఆమనగల్లు మండలాల్లోని తండాలకు రహదారుల నిర్మాణానికి రూ. 36.93 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కడ్తాల్ మండలం చల్లంపల్లి నుంచి నార్లకుంట తండా వరకు రూ. 3.30కోట్లతో రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. అలాగే చరికొండ నుంచి బోయినుగుట్ట వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 2.10కోట్లు, పీడబ్ల్యూ రోడ్డు నుంచి వెలుగురాళ్ల తండా వరకు రోడ్డు నిర్మాణికి రూ. 1.20 కోట్లు, అన్మాస్‌పల్లి నుంచి పుల్లేర్‌బోడ్ తండా వరకు రోడ్డు నిర్మాణికి రూ. 1.20 కోట్లు, కడ్తాల్ నుంచి కానుగుబావి తండా రోడ్డుకు రూ. 1.20 కోట్లు, అన్మాస్‌పల్లి నుంచి పోచమ్మగడ్డ తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 75 లక్షలు, బాలాజీనగర్ నుంచి వాస్‌దేవ్‌పూర్ వరకు రోడ్డు వేయడానికి రూ. 1.50 కోట్లు, చల్లంపల్లి నుంచి రేకుల తండా వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ పనులకు అదనంగా రూ. 50లక్షలు, మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ. 50లక్షలు, గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ. కోటి, మహిళా సమాఖ్య భవనానికి రూ. 20లక్షలు మంజూరైనట్లు చెప్పారు. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యా నాయక్, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు కృష్ణయ్య, భారతమ్మ, సులోచన, రవీందర్‌రెడ్డి సుగుణ, భాగ్యమ్మ, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, గోపాల్, మంజుల, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ నర్సింహ, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ వీరయ్య, ఉప సర్పంచులు రామకృష్ణ, అనిల్, నాయకులు సాయిలు, జంగయ్య, నర్సింహగౌడ్, చంద్రమౌళి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవన్ నిర్మాణానికి రూ. 2కోట్లు

ఆమనగల్లు: పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2కోట్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని తండాలకు బీటీ రోడ్లు వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల జెడ్పీటీసీలు అనురాధ, జె దశరథ్ నాయక్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యా నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్ రావ్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లచ్చిరాంనాయక్, పంతునాయక్, జోగువీరయ్య, ఏ శ్రీను, ఏ రఘు, రామకృష్ణ, సీ నిరంజన్‌గౌడ్, ప్రశాంత్, రమేశ్, ఎం రవీందర్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రాజు (ఫైల్)

షాద్‌నగర్ రూరల్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన షాద్‌నగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్‌కు చెందిన ఎం రాజు(47) షాద్‌నగర్ నుంచి కాలి నడకన చటాన్‌పల్లికి బయలుదేరాడు. చటాన్‌పల్లి రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతుండగా యశ్వంత్‌పూర్ – హజ్రత్ నిజాముద్దీన్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. స్టేషన్ మాస్టర్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే ఎస్ఐ అక్బర్ తెలిపారు.

మహిళ అదృశ్యం



మల్లీశ్వరి (ఫైల్)

మొయినాబాద్: మహిళ అదృశ్యమైన సంఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాపూర్‌కు చెందిన ఏ శ్రీకాంత్, మల్లీశ్వరి దంపతులు. వీరు పిల్లలతో కలసి మొయినాబాద్‌లో ఉంటున్నారు. ఈ నెల 2న శ్రీకాంత్ చేపలు పట్టడానికి వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి రాగా భార్య మల్లీశ్వరి కనిపించలేదు. ఆమె సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడం, ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పరిశ్రమ అనుమతుల రద్దు !



కాలుష్య నియంత్రణ మండలిలో వాదనలు వినిపించి బయటికి వచ్చిన అన్నోజిగూడ వాసులు

- కాలుష్య నియంత్రణ మండలి హామీ
- అన్నోజిగూడ వాసుల వాదనలతో ఏకీభవించిన చైర్మన్
- సంతోషం వ్యక్తం చేసిన ప్రజలు

కందుకూరు: మండలంలోని అన్నోజిగూడ పరిధిలో గల ఎస్ఎస్ బ్యాటరీ రీ సైక్లింగ్ పరిశ్రమపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో గ్రామస్తులు తమ వాదనలు వినిపించి విజయం సాధించారు. మంగళవారం సర్పంచ్ కే ఇందిర, నాయకుడు కే దశరథ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ ముందు హాజరై వాదనలు వినిపించారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని వారు చైర్మన్‌కు వివరించారు. అటు కంపెనీ ప్రతినిధులు కూడా వారి వాదనలు వినిపించారు. అయితే చైర్మన్ అన్నోజిగూడ వాసుల వాదనలతో ఏకీభవించారు. కాలుష్య కారక పరిశ్రమ అనుమతులు రద్దు చేయడమే కాకుండా మూసివేసేలా ఆదేశాలు జారీ చేయనున్నట్లు చైర్మన్ తమకు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో వారు గ్రామం తరఫున చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, నాయకులు ఏ కృష్ణ, జీ కృష్ణ, పీ మహేందర్, జీ రామకృష్ణ, జీ మహేందర్, ఏ రాజు, కే పరమేష్, డీ సురేష్, జే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నృత్య 'కీర్తి'

వృత్తి రీత్యా ఆమె ఉపాధ్యాయురాలు.. కానీ కూచిపూడి నృత్యంలో తనకంటూ ఓ ప్రత్యేకతను సంపాదించుకుంది. తనకు ఇష్టమైన కళారంగంలో రాణిస్తూ మహానంది జాతీయ పురస్కారం అందుకుంది. ఆమే జిల్లేడ్ చౌదరిగూడ మండలం పిర్జాపూర్ ప్రభుత్వ పాఠశాల టీచర్ కీర్తి.

- ఓ వైపు ఉపాధ్యాయురాలిగా రాణిస్తూనే..
- మరో వైపు నృత్య ప్రదర్శనలో అవార్డులు
- కూచిపూడిలో మహానంది జాతీయ పురస్కారం



మహానంది పురస్కారం అందుకుంటున్న కూచిపూడి నృత్య కళాకారిణి కీర్తి

కొందుర్గు: మండల కేంద్రానికి చెందిన శశికళ, విజయ్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు కీర్తి, దీప్తి, కుమారుడు రవితేజ. పెద్ద కూతురు కీర్తి ఉన్నత చదువులు చదువుకొని అతి చిన్న వయస్సులోనే ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడింది. చిన్నకూతురు దీప్తి, రవితేజ ప్రస్తుతం చదువుకుంటున్నారు. కీర్తి ఏడేళ్ల ప్రాయంలోనే నృత్యం నేర్చుకోవాలనే ఆసక్తితో అజయ్ నటరాజ కళా నిలయంలో చేరింది. అక్కడ నృత్య అధ్యాపకులు శ్రీదేవి, ప్రదీప్‌కుమార్ సారథ్యంలో కూచిపూడి అడుగులు ప్రారంభించి ప్రావీణ్యం పొందింది. పలుమార్లు జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొని అవార్డులు సొంతం చేసుకుంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో హుస్నాబాద్‌లో యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య కళా పోటీల్లో పాల్గొని జాతీయ పురస్కారం అందుకుంది. ఆదివారం హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలో కీర్తి తన ప్రతిభను చాటి మహానంది జాతీయ పురస్కారం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సరస్వతీ మాతా ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వలబోజు మోహన్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కీర్తికి జాతీయ అవార్డు రావడంతో స్థానికులు అభినందనలు తెలిపారు.



కీర్తి


ఇసుక ట్రాక్టర్ సీజ్

ఆమనగల్లు: మాడ్గుల మండలం అందుగుల వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు మాడ్గుల సీఐ కృష్ణమోహన్ మంగళవారం తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన ట్రాక్టర్ యజమాని కే శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

తల్లి, బిడ్డ అదృశ్యం

మొయినాబాద్: తల్లి, బిడ్డ అదృశ్యమైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దమంగళారం గ్రామానికి చెందిన పీ భిక్షపతితో రేణుక దంపతులు. వీరికి ఏడాది కూతురు ఉంది. సోమవారం భిక్షపతి తన తల్లిదండ్రులను మొయినాబాద్‌లో వదిలిపెట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం 6.30 గంటలకు ఇంటికి వచ్చాడు. భార్య రేణుక, కూతురు జానకి కనిపించలేదు. చుట్టుపక్కల ఇళ్లల్లో, పరిసర ప్రాంతాల్లో వెతికాడు. రేణుక ఫోన్ స్విచ్ ఆఫ్ రావడం, ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామాల్లో 'బలగం'



చేవెళ్ల: ఇటీవల తెలంగాణ గ్రామీణ ప్రాంత నేపథ్యంలో విడుదలై విశేష ఆదరణ పొందిన బలగం సినిమా ఇప్పుడు గ్రామాల్లో ప్రదర్శనలకు వేదికగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు ఈ సినిమాను చూపించేందుకు సిద్ధమయ్యారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. దేవరంపల్లిలో సోమవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. మంగళవారం రాత్రి మల్కాపూర్‌లో ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో, రావులపల్లిలో సర్పంచ్ కే శ్రీనివాస్, రామన్నగూడలో సర్పంచ్ లావణ్య ఆధ్వర్యంలో సినిమాను ప్రదర్శించారు. ఈ నెల 7న చేవెళ్లలో జెడ్పీటీసీ ఎం మాలతి ఆధ్వర్యంలో బిగ్ స్క్రీన్‌పై బలగం సినిమాను ప్రదర్శించనున్నారు. నేడు (బుధవారం రాత్రి) దేవుని ఎర్రవల్లిలో సర్పంచ్ మాణిక్యరెడ్డి, గ్రామ యూత్ ఆధ్వర్యంలో సినిమాను ప్రదర్శించనున్నారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు



ఆదిబట్లలో పోలీస్ విధుల గురించి వివరాలు నమోదు చేసుకుంటున్న ట్రైనీ ఐపీఎస్‌లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను ట్రైనీ ఐపీఎస్‌ల బృందం సందర్శించింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలీసుల విధుల గురించి తెలుసుకున్నారు. నేషనల్ పోలీస్ అకాడమీలో శిక్షణ పొంది క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం ఇక్కడికి వచ్చారు. తెలంగాణ క్యాడర్‌కు కేటాయించిన కాజల్, సుజన్ శ్రేష్ఠ, దుగాడ్ దర్శన్, జీవన్ బెనివాల్, శోభంనాగ్రాలే అధికారుల బృందం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసుల విధుల గురించి తెలుసుకున్నారు. తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, ఎఫ్ఐఆర్ నమోదు, జీడీ, నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలు, నిందితుల వివరాలు తెలుసుకున్నారు. సీసీటీవీల పర్యవేక్షణ, ఈ క్యాబ్ పనితీరు పరిశీలించారు. ఎస్ఐలు సురేష్, కృష్ణయ్య ఉన్నారు.

ఠాణాను సందర్శించిన ట్రైనీ ఐపీఎస్‌లు

షాద్‌నగర్ రూరల్: శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారుల బృందం మంగళవారం షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. క్షేత్రస్థాయిలో కేసుల పరిశీలనపై అధ్యయనం చేసేందుకు ఠాణాకు వచ్చామని వారు తెలిపారు. కేసులపై ఏ విధంగా స్పందించాలి, కేసుల ఛేదన ఎలా చేయాలి అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆమనగల్లు స్టేషన్‌లో..

ఆమనగల్లు: శిక్షణలో భాగంగా ట్రైనీ ఐపీఎస్‌లు మంగళవారం ఆమనగల్లు, కడ్తాల పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ ఉపేందర్, ఎస్ఐలు హరిశంకర్‌గౌడ్, సుందరయ్య ట్రైనీ ఐపీఎస్‌లకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పోలీసు స్టేషన్ నిర్వహణ, నేరాలు, కేసులు, కోర్టు విధులు, సమన్లు, వారెంట్ల జారీ గురించి అవగాహన కల్పించారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌ను ట్రైనీ ఐపీఎస్‌లు శశిశేఖర్, రోహన్‌జా, జయవీర్, నవజ్యోత్ మిశ్ర, స్వప్నిల్ మానె సదర్శించగా, కడ్తాల స్టేషన్‌ను రాజ్‌కుమార్ మీన, శివంగి గోయల్, మీర్జాషా, సవితగోత్యాల్ సందర్శించారు.

కొందుర్గు పోలీస్‌స్టేషన్‌లో..

కొందుర్గు: శిక్షణలో భాగంగా మంగళవారం వివిధ రాష్ట్రాలకు చెందిన ఐదుగురు ట్రైనీ ఐపీఎస్‌లు కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు పోలీసుల విధుల గురించి తెలుసుకున్నారు. పలు అంశాలపై షాద్‌నగర్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు ద్వారా తెలుసుకున్నారు.

యాచారం పీఎస్‌ను..

యాచారం: వివిధ రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐపీఎస్‌ల బృందం మంగళవారం యాచారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించింది. మౌనిక, ఇషాసింగ్, తరుణ్ గోయల్, విజయకుమార్, సునందానాయక్ బృందం సీఐ లింగయ్యతో సమావేశమయ్యారు. పోలీస్‌స్టేషన్ విధులు గురించి తెలుసుకున్నారు.